ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శనివారం 21 సెప్టెంబరు 2024

చిరు జల్లులు

వికారాబాద్/ధారూరు, సెప్టెంబరు 20: కొన్ని రోజులుగా ముఖం చాటేసిన వణరుడు మరోసారి కరుణించాడు. శుక్రవారం జిల్లాలో నిర్మలంగా ఉన్న ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొద్ది సేపు పలు చోట్ల చిరు జల్లులు కురిశాయి. వికారాబాద్, ధారూరులో ఉదయం నుంచి ఎండ దచ్చికొట్టగా. తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చిరుజల్లులతో కూడిన వాన కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, సెప్టెంబరు 20: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా వికారాబాద్ జిల్లాలో 1.70 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సరిగా వేతనాలు అందించలేని పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతీ నెల మొదటి తేదీన వేతనాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని, త్వరలోనే మహిళలకు రూ.2500 సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికా రి పూర్ణచందర్‌రావు, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర చక్రవర్తి, ఏఈ ప్రణీ త్, అభిషేక్, సుమిత్ర, ఎంపీవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సురేందర్, సిరాజుద్దీన్, ఏరాజ్‌పాష, సంగమేశ్వర్‌గౌడ్, పోచయ్య, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

ఒకే దేశం- ఒకే ఎన్నిక మంచి పరిణామం

● చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 20: ఒకే దేశం-ఒకే ఎన్నిక మంచి పరిణామమని, దీంతో ఇతర పార్టీల్లో వణుకు పుడుతుందని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో పర్యటించిన ఆయన ముందుగా శారద ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని, అనంతరం బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ దేశాన్ని విడగొట్టేందుకు కుట్ర చేస్తుందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ అఖండ భారత దేశం ఏకతాటిపై అభివృద్ధి చేసే విధంగా ముందుకు పోతున్నారన్నారు. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలుతో పాటు ఈ ప్రాంతంలో అవసరమయ్యే బ్రిడ్జిలు కోసం ప్రతిపాదనలు పెట్టడం జరిగిందన్నారు. అనంతగిరి అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల్లో నన్ను ఓడగొట్టేందుకు పార్టీ పరంగా స్పీకర్ పనిచేశారని కానీ ఇప్పుడు ఈ ప్రాంత అభివృద్ధి కోసం కలిసి పనిచేయడం జరుగుతుందన్నారు. అప్పా నుంచి మన్నెగూడ వరకు రోడ్డును నా హయాంలోనే తీసుకురావడం జరిగిందని వికారాబాద్ నుంచి తాండూరు, వికారాబాద్ నుంచి జహీరాబాద్ వరకు రోడ్డు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. తాండూరులో నాపరాత్రి గనులను దూరంగా 300 ఎకరాలు కేటాయించి తరలించేందుకు చూస్తున్నామని దీని వెస్టేజ్‌ను కూడా సిమెంట్ ఫ్యాక్టరీలకు ఇచ్చేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. హైడ్రాపై నాలుగు ఆరోపణలు, రెండు అనుమానాలు ఉన్నాయన్నారు. అవి నిజమైతే హైడ్రా ఉన్న లేకున్న ఒక్కటే అని దాని వల్ల కాంగ్రెస్‌కే నష్టమన్నారు. తాండూరులో కంది బోర్డు కన్నా, కందికి మద్దతు ధర లభిస్తే బాగుంటుందని తెలిపారు. దామగుండంలో నేవీ ర్యాడార్ లోరేడియేషన్ అని, ఎవరికి ఇబ్బంది ఉండదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, శివరాజ్, రాజేందర్‌రెడ్డి, పాండు, కేపీరాజు, యాష్మిశిరీష, విజయ్ బాస్కర్ రెడ్డి, వివేకానందారెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలే రక్ష

మర్పల్లి, సెప్టెంబరు 20 : ఆడ పడచులకు కానుకగా గత ఏడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుమ్మ చీరలు రెవెన్యూ రికార్డుల భద్రపరిచేందుకు రక్షణగా మారాయి. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుండగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పంపిణీకి బ్రేక్ పడింది. దీంతో మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలోనే ఉండిపోయాయి. తర్వాత పంపిణీ చేయలేదు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు గది పూర్తిగా శిథిలవస్థకు చేరి వర్షం పడితే కురుస్తుంది. దీంతో రికార్డు గదిలో ఉన్న ఫైళ్లను బతుకమ్మ చీరల్లో కట్టి భద్రపరిచారు. ఆ చీరలు మహిళలకు ఉపయోగపడకపోయినా రెవెన్యూ రికార్డులు తడిసిపోకుండా రక్షణగా ఉన్నాయి. ఈ సారైనా ప్రభుత్వం నాణ్యమైన బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని మహిళలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ చీరల్లో కట్టిన ఫైళ్లు



నారాయణపూర్‌లో నల్లబారిన పత్తి చేను

అరుగాలం కష్టించే రైతులు అడుగడునా కష్టాల పాలవుతున్నారు. ఓ పక్క అతివృష్టి, మరో పక్క అనావృష్టితో అతలాకుతలం అవుతున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వానలు పత్తి రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. పత్తిపంట పూర్తిగా దెబ్బతిన్నది. చేలల్లో నీరు నిలిచి పూత, కాయలు రాలిపోవడంతో పాటు మొక్కలు మురిగిపోయాయి. కొన్ని చోట్ల పత్తి పంట ఏపుగా ఎదిగినా బెల్లం తెగులు, ఎర్రబొమ్మడి సోకడంతో పత్తి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

మూడి రైతు దుఃఖం!

ఆరంభంలో వర్షాభావం

- ఆ తర్వాత అధిక వర్షంతో ఆగమాగం
- దంచికొట్టిన వానలకు దెబ్బతిన్న తెల్లబంగారం
- పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఎకరాకు నాలుగు క్వింటాళ్ల పత్తి వచ్చేదీ కష్టమే
- పెట్టుబడులు రాని దుస్థితి.. ఆందోళనలో పత్తి రైతులు

పరిగి, సెప్టెంబరు 20: జిల్లాలో ఇటీవల కురిసిన వానలు పత్తి రైతులను దెబ్బతీశాయి. వానాకాలం సీజన్ ఆరంభంలో వర్షాభావం, ఆ తర్వాత ఎడతెరపిలేకుండా కురిసిన వానలు అన్నదాతలను తెల్లబోయేలా చేసింది. ఏపుగా ఎదిగి ఊపుమీద ఉన్న పత్తి పంట కురిసిన వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. చేలల్లో నీరు నిలిచి పత్తికాయలు రాలిపోవడమే కాకుండా పత్తిమొక్కలు కూడా నిలువునా మురిగిపోయాయి. ప్రస్తుతం పూత, పత్తి కాయలతో కళకళాడాల్సిన చేన్లు జిల్లాలో ఎక్కడా చూసిన నీట మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటను కాపాడుకునేందుకు ఆరంభం నుంచి అష్టకష్టాలు.. ఆపై పురుగుల బాధతో తీవ్ర నష్టాలు పాలు చేశాయని రైతులు వాపోతున్నారు. ఈ సారి జిల్లాలో పత్తిసాగు గత ఏడాదితో పోలిస్తే తగ్గింది. అయితే సాగు చేసిన రైతులను వానలు నిండా ముంచాయి. జిల్లాలో పత్తి గత ఏడాది 2,53,063 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 2,10,134 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. పత్తిసాగు చేసిన రైతుల ఆశలపై అధిక వర్షం నీళ్లు చల్లింది. ఈసారి మొదటి నుంచి సరిపడా వర్షాలు కురియక విత్తనాలు ఆలస్యంగా విత్తనారు. మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాయ దశలో కురిసిన వానలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పత్తి రైతు ఆశతో పత్తి సాగు చేయగా కాలం కలిసి రాకపోవడంతో సగానికి సగం కూడా దిగుబడులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పత్తి పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు సమర్పించిన నివేదికలు నామమాత్రంగానే ఉన్నాయి. జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాలకు పైగా పత్తి పంటకు నష్టం జరిందని ప్రాథమిక అంచనా. అయితే అధికారుల మాత్రం పది వేలలోపు మాత్రమే నష్టం జరిగిందని చెబుతున్నారు. పత్తి సాగుకు అన్ని రకాలుగా అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ సారి ఎకరాకు రెండు,మూడు క్వింటాళ్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరాలకు రూ.35వేల వరకు పెట్టుబడులు పెట్టారు. దిగుబడి రెండు, మూడు క్వింటాళ్లు వస్తే కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



పరిగి శివారులో వానకు నేలకొరిగిన పత్తి మొక్కలు (ఫైల్)

అధిక వర్షాలకు తోడు, తెగులు

అధిక వర్షానికి తోడు భూముల్లో పోషకాల లోపం, మొక్కలను సరిగ్గా నీరు అందకపోతే పత్తి మొక్కలకు ఎర్రబొమ్మడి సోకుతుంది. ఎర్రనేల భూముల్లోని పత్తికి అయితే ఇది వేగంగా వ్యాపిస్తుంది. పంట ఏపుగా ఏదిగినా మొక్కలు ఎర్రబారిపోవడం, పూత, కాయలు రాలిపోవడం దీని లక్షణం. ప్రస్తుతం జిల్లాలో వేల ఎకరాల్లో పత్తి పంటకు ఎర్ర తెగులు సోకింది. ఎన్నడు లేని విధంగా పత్తికి పూత, కాయలు రాలిపోతూ మొక్క చనిపోతుండడంతో రైతులకు దిక్కుతోచక దిగాలు చెందుతున్నారు.

పెట్టుబడులు రాని పరిస్థితి

పత్తి విత్తనాలు నాటే దశ నుంచి ఈ ఏడాది రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మొదట్లో వరణుడు ముఖం చాటేశాడు. వర్షాభావంతో విత్తిన విత్తనాలు భూమిలోనే కలిసిపోయాయి. రెండో సారి కొన్ని చోట్ల మళ్లీ విత్తనాలు విత్తారు. ఎరువులు, పురుగులమందులు, కలుపుతీతలకు భారీగా పెట్టుబడులు పెట్టారు. తీరా పంట చేతికొస్తున్న దశలో భారీ వర్షాలు దెబ్బతీశాయి. నెల రోజులపాటు ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలు నష్టాల పాలు చేశాయి. వర్షంతో దెబ్బతో పాటు, బెల్లం తెగులు సోకడంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఎకరానికి మూడు, నాలుగు క్వింటాళ్ల పత్తి చేతికందే పరిస్థితి లేదని వాపోతున్నారు.



పత్తి రైతులను ఆదుకోవాలి

ఆరు ఎకరాల్లో పత్తిసాగు చేశా. రూ.1.80లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రారంభంలో వర్షాలు కురియక ఆలస్యంగా విత్తాం. ఆ తర్వాత అధికవర్షానికి పత్తి చేలులో నీరు నిలిచి మొక్కలు మురిగిపోయాయి. పత్తికాయ దశలోనే అధిక వర్షాలకు నీరుపట్టి మురిగిపోయింది. కాయలు వర్షానికి రాలిపోయాయి. ఎకరాకు రెండు క్వింటాళ్ల పత్తి వచ్చే పరిస్థితి లేదు. పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



- టి.శాశంక్‌రెడ్డి, రైతు, సుల్తాన్‌పూర్

ఎన్నాళ్లీ మొరాయింపు

- 10 రోజులుగా మీ-సేవ సేవలకు అంతరాయం
- ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం
- కేంద్రాల ఎదుట ప్రజలు పడిగాపులు

మేడ్చల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మీసేవ కేంద్రాల్లో సేవలకు దాదాపు పది రోజులుగా అంతరాయం కలుగుతున్నది. నేడు ప్రభుత్వ శాఖల్లో ఏ పనైనా సరే మీసేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ శాఖల నుంచి పొందాల్సిన ధ్రువపత్రాలు, వివిధ సేవలకు దరఖాస్తులు చేసే ప్రక్రియ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు మీసేవా కేంద్రాలకు వెళ్లగా అవి మొరాయిస్తుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దాదాపు 350 రకాలకు పైగా సేవలు మీ సేవ నుంచి అందిస్తున్నారు. సర్వర్ సమస్యలు ఎదురవడంతో రెవెన్యూ, కార్మికశాఖ సేవలతో పాటు ఆదాయ, మరణ, జనన ధ్రువపత్రాలు రావడం లేదు. ఈసీ, కార్మిక కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా ధ్రువపత్రాలు జారీ కావడం లేదు. ఘట్‌కేసర్, కీసర, మేడ్చల్ మండలాల్లో ఈ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. గంటల తరబడి ప్రయత్నిస్తే ఒక్క దరఖాస్తు అవుతోందని, కొన్ని కేంద్రాల్లో అసలు కావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి పలు ధ్రువపత్రాలకు సంబంధించిన డేటా లభ్యం కావడం లేదని తెలుస్తున్నది. అలాగే ధరణి సేవల్లో తీవ్ర అంతరాయం కలుగుతోంది. లాగిన్ అయ్యే వారికి పాస్‌వర్డ్ పంపినట్లు కంప్యూటర్‌లో చూపుతున్నా సెల్‌ఫోన్‌కు సమాచారం రావడం లేదు. స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో దరఖాస్తుదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.



ఘట్‌కేసర్‌లో మూసివేసిన మీసేవ కేంద్రం

గంటల తరబడి నిరీక్షణ

తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ పని నిమిత్తం దరఖాస్తు చేసుకుందామని నాలుగు రోజులుగా మీసేవ కేంద్రానికి వెళ్తున్నాను. సర్వర్ పని చేయక, గంటల తరబడి ఎదురుచూసినా మెసేజ్‌లు రావడం లేదు. వేరే కేంద్రానికి వెళ్లినా ఇదే పరిస్థితి. వందల మంది వివిధ గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు.



- కల్లెం శ్రీకాంత్‌రెడ్డి, కొండాపూర్



మాట్లాడుతున్న రియాజ్

గ్రంథాలయాల్లో యువతకు నైపుణ్య శిక్షణ

- గ్రంథాలయాలను డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దుతాం
- వాటి బలోపేతం చేసే దిశగా చర్యలు
- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్

వికారాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి వికారాబాద్) : పౌర గ్రంథాలయాలను డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం, సంస్థ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పౌర గ్రంథాలయాలను బలోపేతం చేసే దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. 80 వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే కేసీఆర్ తన హయాంలో గ్రంథాలయాల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. సమాజంలో ఎంతో కీలక భూమిక పోషించే గ్రంథాలయాల బలోపేతానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో పౌర గ్రంథాలయాల్లో 700 ఖాళీలు ఉన్నాయని, సరిపడా సిబ్బంది లేక గ్రంథాలయాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే విషయమై ఇటీవల సీఎంతో చర్చించామని, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. గ్రంథాలయాలకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులే కాకుండా చిన్నారులు, మహిళలు, వృద్ధులు, సాధారణ ప్రజలు కూడా రావాలన్నదే తమ లక్ష్యమన్నారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు కోరుకునే పుస్తకాలను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని వలస ప్రజలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న జిల్లాల్లోని గ్రంథాలయాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి పొందే విధంగా చూస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయని, విచక్షణా, జ్ఞానం పెంపొందించడంలో పుస్తకాలది ప్రముఖమైన పాత్ర అన్నారు. పుస్తకాలు చదవడాన్ని బతికించాలన్నారు. ప్రపంచంలో ఏ మూలలో ఏమి జరిగినా తెలియజేసేవే వార్తా పత్రికలని, పత్రికలు చదవని రోజూ ఏదో కోల్పోయిన భావన ఏర్ప డుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో రియాజ్ మాట్లాడారు. గ్రంథాలయంలో పాఠకుల కోసం కల్పించిన సదుపాయాలపై ఆయన ఆరా తీశారు. అదనంగా టాయిలెట్లు, కొత్త పుస్తకాలు అందుబాటులోకి తీసుకు రావాలని కోరగా, ఆయన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్‌బాబును ఆదేశించారు. అభ్యర్థుల కోసం గ్రంథాలయంలో కొత్తగా కల్పించిన సదుపాయాల గురించి ఆయన చైర్మన్‌కు వివరించారు. పోటీ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలనేదానిపై వివరించారు. వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనం, నిర్వహణ తీరు బాగుందంటూ ఆయన ప్రశంసించారు.

ప్రతీ పంచాయతీలో ప్రజాపాలన కేంద్రం

● వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ , సెప్టెంబరు 20: జిల్లాలో ప్రజాపాలన సేవ కేంద్రాలు ప్రతి గ్రామ పంచాయతీ లో ఏర్పాటు చేశామని, వచ్చిన దరఖాస్తులపై దృష్టి సారించి క్షుణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.శుక్రవారం జిల్లాలోని ఎంపీడీవో, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో 566 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవ కేంద్రాలకు వచ్చిన ప్రజలు ఏ ఒక్కరిని కూడా రిటన్ పంపరాదని, వారి యొక్క గ్యాస్ సిలిండర్ కనెక్షన్ కోసం రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, ఫోన్ నెంబర్ తీసుకొని ఏదైనా సమస్య ఉంటే క్లియర్ చేయాలన్నారు. జిల్లాలో ఉండే అంగన్ వాడీ సెంటర్ల బిల్డింగ్స్‌కు పెయింటింగ్ , తాగునీరు, లెట్స్ పూర్తి చేయాలనీ, నర్సరీల్లో నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల వల్ల జిల్లాకు మంచి గుర్తింపు వచ్చిందని ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా జాబ్ కార్డ్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీఏ శ్రీనివాస్, మిషన్‌భగీరథ ఈఈ చల్మారెడ్డి , శిశుసంక్షేమ శాఖా అధికారి కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆదర్శ పాఠశాలల పనులను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుధీర్

దోమ, సెప్టెంబరు 20: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో సుధీర్ తెలిపారు. శుక్రవారం దోమలోని బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమంపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రతీ విద్యార్థి ఆంగ్ల మాధ్యమంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

బషీరాబాద్ సీహెచ్‌సీలో ఫ్యాన్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బషీరాబాద్ సీహెచ్‌సీలో ఏర్పాటు చేస్తున్న ఫ్యాన్

బషీరాబాద్, సెప్టెంబర్ 20: బషీరాబాద్ సీహెచ్‌సీలో 'ఫ్యాన్లు లేక రోగుల అవస్థలు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పందించారు. స్థానిక నాయకులతో ఎమ్మెల్యే ఆరా తీసి నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్‌కు వెంటనే ఆస్పత్రి ఇన్‌పేషెంట్ వార్డులో ఫ్యాన్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురు, శుక్రవారాలు వార్డులు, మెయిన్‌హాల్, సిబ్బంది కూర్చునే గదుల్లో కొత్త ఫ్యాన్లు అమర్చారు. ఎమ్మెల్యే చొరవతో ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో రోగులు, సహాయకులు, వైద్య సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు పక్కన చెట్లు నరికివేత



శంకర్ కొండ వద్ద నరికివేసిన చెట్లు

ఆమనగల్లు, సెప్టెంబరు 20: మండల పరిధిలోని శంకర్ కొండ తండాలో గుర్తు తెలియని వ్యక్తులు హరితహారంలో భాగంగా నాటిన చెట్లను నరికివేశారు. మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గుల్‌మొహర్(పెద్దవి) చెట్లను నాటారు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు 30 చెట్లను నరికివేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో కుసుమ మాధురి వాటిని పరిశీలించారు. శంకర్‌కొండ పంచాయతీ కార్యదర్శి విజయ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరందించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

కులకచర్ల, సెప్టెంబరు 20: అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరు అందించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలో ప్రతీ పనికి రికార్డు నమోదు చేయాలని తెలిపారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ అర్హులైన లబ్ధిదారులకు అందాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధులు, సీనియర్ సిటిజన్లకు విశిష్ట సేవలందిస్తున్న సంస్థలకు రాష్ట్రస్థాయి అవార్డులను అందజేస్తామని జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25లోపు దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 965239475 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వికారాబాద్‌లో ప్రధాన రైళ్లకు తాత్కాలిక హాల్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 29వరకు షాద్‌నగర్ సమీపంలోని శాంతివనంలో జరిగే అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం.. పలు ప్రధాన రైళ్లకు వికారాబాద్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ముంబై-భువనేశ్వర్, సికింద్రాబాద్-రాజ్‌కోట్ మార్గాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 24 నుంచి 30వ తేదీవరకు నిమిషం పాటు తాత్కాలిక హాల్ట్ ఉంటుందని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

వరిపైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు


వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 20 : మూసీ పరీవాహక ప్రాంత రైతులు రసాయనిక ఎరువులు వాడొద్దని రాజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు కాంతి కృష్ణవేణి, రాకేష్ సూచించారు. శాస్త్రవేత్తలు శుక్రవారం మునిప్పల్, కొర్రెముల్లో వరి పైర్లను పరిశీలించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పోటాష్‌ను ఎకరాకు 15నుంచి 20కిలోలు వేసుకోవాలన్నారు. కాపర్ హైడ్రాక్సైడ్ 400గ్రాములు ప్రతీ ఎకరానికి నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఏఈవో మంజుల, జగదీష్, రైతులు బాల్‌రాజ్, శ్రీశైలం, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడాలి


మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

పరిగి, సెప్టెంబరు 20: విద్యార్థులు ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని డీఈవో రేణుకాదేవి అన్నారు. యంగ్ ఓరిటర్స్ ఆధ్వర్యంలో పరిగిలోని జడ్పీ బాలికల పాఠశాలలో రెండురోజులుగా కొనసాగుతున్న వర్క్‌షాప్‌ను శుక్రవారం డీఈవో సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేలా చొరవచూపాలన్నారు. ఈ శిక్షణ తరగులు ఉపాధ్యాయులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంవో రామ్‌మస్తాన్, ఎంఈవో హరిశ్చందర్, నోడల్ అధికారి గోపాల్, రిసోర్స్‌పర్సన్లు మోయిజ్‌ఖాన్, సంధ్యారాణి, వీణ, స్వప్న పాల్గొన్నారు.

బాల కేంద్రం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అనురాధ



వికారాబాద్, సెప్టెంబర్ 20 : వికారాబాద్ బాల కేంద్రం సూపరింటెండెంట్‌గా డ్యాన్స్ టీచర్ అనురాధను నియామిస్తూ బాలభవన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సూపరింటెండెట్ శ్రీకాంత్‌దీక్షిత్‌పై ఫిర్యాదుల రావడంతో ఆయన్ను తప్పించి అనురాధను ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని అనురాధను ఆదేశించారు.

పోలీసు ఉన్నతాధికారులతో గురునాథ్‌రెడ్డి సమావేశం


పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన గురునాథ్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 20: రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పోలీసు శాఖలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. పోలీస్‌స్టేషన్లు, సిబ్బంది, క్వార్టర్స్ నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఉన్నతాధికారులు రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన బాధ్యతలు సంతోషకరం


కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్, శుభప్రద్

వికారాబాద్, సెప్టెంబర్ 20 : రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో పార్టీ తరపున తనకు అధ్యయన బాధ్యతలప్పగించడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, తాను గాంధీ ఆసుపత్రి, రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి పరిస్థితులపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తాము ఇచ్చే సలహాలు సూచనలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

శుభప్రద్ పటేల్‌కు కేటీఆర్ అభినందన


శుభప్రద్ పటేల్‌ను సన్మానిస్తున్న కేటీఆర్

వికారాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కేటీఆర్ బీసీ కమిషన్ సభ్యుడిగా మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారంటూ శాలువాతో సన్మానించారు. పార్టీలో గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని, పార్టీలో గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమం గురించి ఆలోచించేది బీఆర్ఎస్ పార్టీయే అని గుర్తు చేశారని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థుల ఆందోళన


సిరిపురం ఎస్సీ హాస్టల్‌లో తీసుకుంటున్న విద్యార్థులు

మర్పల్లి, సెప్టెంబరు 20: రోజూ తమకు నీళ్ల చారు, అన్నం పెడుతున్నారని సిరిపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు అన్నారు. కొన్ని రోజులుగా మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలిపారు. శుక్రవారం విద్యార్థులు మాట్లాడుతూ.. హాస్టల్‌లో 40 మంది విద్యార్థులే హాజరవుతున్నా హాజరు పట్టికలో మాత్రం 86 మంది విద్యార్థులు వస్తున్నట్టు చూపుతున్నారని తెలిపారు. చవితి సందర్భంగా విద్యార్థులు ఇళ్లకు వెళ్లారన్నారు. ఈ నెల 18న 26మందే వస్తే 70మందికి వచ్చినట్టు చూపారన్నారు. వార్డెన్ తుల్జారాంను వివరణ కోరగా హాస్టల్‌లో బయోమెట్రిక్ పనిచేయడం లేదని, మాన్యువల్‌గానే హాజరు వేస్తున్నామని చెప్పారు.

వంద ఫీట్లతో కొత్తూర్-జేపీ దర్గా చౌరస్తా రోడ్డు

నాలుగు లేన్ల విస్తరణ పనులు ప్రారంభం




కొత్తూర్-జేపీ దర్గా చౌరస్తా రోడ్డుకు కొనసాగుతున్న పనులు. (ఇన్‌సెట్‌లో) రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

కొత్తూర్, సెప్టెంబరు 20: ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న కొత్తూర్-జేపీ దర్గా చౌరస్తా బీటీ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి బైపాస్ రోడ్డులోని జేపీ దర్గా చౌరస్తా వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు గోతులమయంగా మారి, అస్తవ్యస్థంగా తయారు కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. ఇదే రోడ్డులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, పలు కాలనీలు ఉండడంతో రాకపోకలు అధికంగా ఉంటాయి. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని 1.04కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా మార్చేందుకు హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి రూ.18కోట్లు మంజూరయ్యాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అవి తొలగిపోవడంతో ఇటీవల తిరిగి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైనాయి. హెచ్ఆర్‌డీసీ సిబ్బంది రోడ్డు విస్తరణ పనుల కోసం మార్కింగ్ కూడా చేస్తున్నారు. వంద ఫీట్ల నాలుగు లేన్ల రోడ్డు విస్తరణలో భాగంగా 2మీటర్లతో డివైడర్, రోడ్డుకు అటు, ఇటు 2మీటర్లతో పుట్‌పాత్, ఒక మీటర్‌తో అటు, ఇటు డ్రైనేజీ పనులు చేపట్టేందుకు అధికారులు డిజైన్ రూపొందించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య త్వరలో తీరిపోనుంది.

మైసమ్మగూడలో రోడ్డు వివాదం

- అక్రమ నిర్మాణాలకు నోటీసివ్వాలని కమిషనర్ నిర్ణయం


మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కాలనీవాసులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 20 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలో రోడ్డు వివాదం కొత్త వివాదానికి తెరలేపింది. కాలనీ 20 ఫీట్ల రోడ్డుకు అడ్డంగా గోడకట్టారని కాలనీ వాసులు శుక్రవారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ప్లాట్లను విక్రయించిన వెంచర్ వారికి, కౌన్సిలర్లను, గ్రామపెద్దలను పిలిచి మాట్లాడారు. కాగా ఈ లేఅవుట్‌కు అనుమతే లేదన్న విషయం బయట పడింది. మైసమ్మగూడలోని సర్వే నంబర్ 594, 595, 596 597లలో శ్రీరాములు, దుర్గేష్ తమ రెంఎకరాల్లో పదేళ్ల క్రితం లేఅవుట్ చేసీ ప్లాట్లు అమ్మారు. కొంత స్థలాన్ని తమ వద్దే ఉంచుకున్నారు. ప్లాన్‌లో కాలనీలోకి ప్రవేశించే రోడ్డును గ్రామంలోని ఒక పక్క నుంచి చూపారు. సర్వే నంబర్ 594లో భూ యజమానుల స్థలం నుంచే కాలనీవాసులు, విద్యార్థులు రాకపోకలు సాగించారు. ప్రస్తుతం ఇక్కడ భూమి ధర పెరగటంతో భూయజమాని ఖాళీ స్థలంలో గోడను కట్టాడు. రాకపోకలు సాగించకుండా గోడకట్టారని కాలనీ వాసులు, హాస్టళ్ల యజమానులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

కమిషనర్ విస్మయం

కాగా కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలపై తెలుసుకున్న మున్సిపాలిటీ కమిషనర్ స్వామినాయక్ ఆశ్చర్యపోయారు. అనుమతులు లేకుండా ఐదారంతస్తుల బిల్డింగ్‌లు ఎలాకట్టారని భూ యజమానులను, ప్లాట్ల ఓనర్లను నిలదీశారు. వారందరికీ నోటీసులివ్వాలని కమిషనర్ నిర్ణయించారు. దీనిపై అక్కడే ఉన్న కౌన్సిలర్లు సైతం సమ్మతి తెలిపారు. సర్వే నంబర్ 594, 195, 596, 597లలో అక్రమంగా కట్టిన భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చి అవసరమైతే కూల్చివేయాలని కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, అమరం హేమంత్‌రెడ్డి, పెంటయ్య చెప్పటంతో నోటీసులిస్తామని కమిషనర్ తెలిపారు. దీంతో రోడ్డు సమస్య పరిష్కారానికి వచ్చి కొత్త సమస్యను కొని తెచ్చుకున్నామంటూ కాలనీ వాసులు, స్థలయజమానులు అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్‌యాదవ్, బాల్‌రాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో సుధాకర్‌రెడ్డి

జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక

బషీరాబాద్, సెప్టెంబర్ 20: బషీరాబాద్‌లోని జడ్పీ పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి క్రీడల ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంఈవో సుధాకర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఎంపికలో మొదటి రోజు అండర్-14 బాలబాలికలకు ఖోఖో పోటీలను నిర్వహించారు. అండర్-14, 17వాలీబాల్, కబడ్డీ, వివిధ విభాగాల్లో పరుగు పందెం, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్ అంశాల్లో సెలెక్షన్లు జరుగనున్నాయి. ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారిని జోనల్‌స్థాయికి ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ జె.అంబదాస్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు భాస్కర్, గంగయ్య, రాజశేఖర్, బుగ్గప్ప, జ్యోతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


కందుకూరు : కార్మికులతో కలిసి వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్

కందుకూరు, సెప్టెంబరు 20: మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడునెలల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆ సంఘం నేతలతో కలిసి మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మండల విద్యాధికారి మనోహర్‌కు వినతి పత్రం ఇచ్చారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడునెలల బిల్లులు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఆగస్టు 21న కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామని, ఐదు రోజుల్లో బిల్లులను వారివారి బ్యాంకు అకౌంట్లల్లో వేస్తామని హామీ ఇచ్చి నేటికీ బిల్లులు మంజూరు చేయకపోవడం ఏమిటని అన్నారు. ప్రభుత్వం ప్రతీనెల 5వ తేదీ వరకు బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టిడించనున్నట్లు తెలిపారు. కార్మికులు ప్రభావతి, శ్రీనివాస్, గీత, మంగ, అండాలు, కలమ్మ, అశ్విని, విజచ. భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రికార్డులు నెలకొల్పాలి

బాస్కెట్ బాల్ క్రీడాకారిణి పుష్పసింథల్‌కుమార్



క్రీడాకారిణికి మెమెుంటో అందజేస్తున్న డైరెక్టర్ వెంకటమురికి

శామీర్‌పేట, సెప్టెంబరు 20 : పాఠశాల, కళాశాలల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి రికార్డులను నెలకొల్పాలని అంతర్జాతీయ జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి పుష్పసింథల్‌కుమార్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం ఉప్పరిపల్లిలోని ఎక్స్‌లెన్సియా కళాశాల గ్రౌండ్స్‌లో పాఠశాల డైరెక్టర్ వెంకటమురికి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ-7 బాస్కెట్ బాల్ బాలికల జాతీయ క్రీడాపోటీలను(20 నుంచి 23 వరకు) పుష్పసింతల్‌కుమార్ ప్రాంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు, పీఈటీలు క్రీడల్లోను నిరంతరం శిక్షణనిస్తు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆటలు ఆడే విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమిస్తారని తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటముల సహజమని, వీటితో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్స్‌లెన్సియా పాఠశాల ప్రిన్సిపల్ నీరజకౌశిక్, సీఓఓ ఈశ్వరన్, బాయ్స్ క్యాంపస్ సెంటర్ హెడ్ రమేశ్, అధ్యాపకులు, పీఈటీలు పాల్గొన్నారు.

హోరాహోరీగా తలపడ్డ క్రీడాకారిణులు

సీబీఎస్ఈ-7 క్లస్టర్ గర్ల్స్ బాస్కెట్ బాల్ క్రీడా పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల క్రీడాకారులు 1,300 మంది వరకు 77 టీమ్‌లుగా పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ జాతీయ బాస్కెట్ బాల్ క్రీడా పోటీలు ఈ నెల 23 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

23, 24న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

శంషాబాద్, సెప్టెంబరు 20 : మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 23, 24వ తేదీల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలకు మౌలిక సౌకర్యాలు దోహదం

షాబాద్, సెప్టెంబరు 20: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు, వసతులు ఉండాలని అమెజాన్ సెక్యూరిటీ హెడ్ జాన్ డయ్యర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ భవనాన్ని సూపర్‌వైజర్ సృజనవాణి, మాజీ సర్పంచ్ పూజితా శ్రీనివాస్‌గౌడ్, అమెజాన్ డేటా సెంటర్ హెడ్ తాతాజీ, కృష్ణచైతన్యలతో కలిసి శుక్రవారం వారు ప్రారంభించారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి


పరిగిలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

పరిగి, సెప్టెంబరు 20: రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగల మేల్కొలుపు యాత్ర శుక్రవారం పరిగి చేరుకుంది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పది జిల్లాల వారీగా మాదిగల జనాభా ఎంతుంటే అంత రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కొన్ని జిల్లాల్లో మాదిగలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. 30ఏళ్ల క్రితం ఉన్న ఏడు శాతాన్ని ఇప్పుడు కూడా అమలుచేస్తే మాదిగలకు అన్యాయమే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు రమేశ్, నాయకులు కె.శ్రీను, పి.శ్రీనివాస్; బి.వీరేందర్, ఉపేందర్, సురేందర్, నరేష్, గణేశ్, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే మాదిగలకు న్యాయం

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డితోనే మాదిగలకు న్యాయం జరుగుతోందని పిడమర్తి రవి అన్నారు. కొడంగల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ పాత 10జిల్లాల్లోని మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రమేశ్‌బాబు, ఎన్.రమేశ్‌బాబు, సురేశ్, ప్రసాద్, జోగుగణేశ్, వజిత్, సాయిలు, చిన్నయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

మేడ్చల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్‌లోని ఎస్-9 కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ఎం.రాధిక శుక్రవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో బెల్‌స్టార్ కంపెనీ ప్రతినిధులు, సేల్స్ ఆఫీసర్లు, బ్రాంచ్ మేనేజర్, అకౌంటెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదవిన జిల్లాకు చెందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. వేతనం రూ.15వేలు వరకు ఇస్తారన్నారు. యువతీ యువకులు పోర్టల్‌లో రిజిష్టర్ చేసుకొని హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9866465024 అనే నంబరులో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలపై ఏసీబీ అధికారుల నజర్

కులకచర్ల, సెప్టెంబరు 20: కులకచర్లలోని ప్రభుత్వ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. గురువారం ఏసీబీ అధికారులు స్థానిక కార్యాలయంలో ఓ ప్రత్యేక కేసులో సందర్శించినట్లు సమాచారం. కొన్ని కార్యాలయాల్లో అధికారులు అవినీతికి పాల్పడుతన్నట్లు బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ప్రధానంగా భూముల రిజిస్ట్రేషన్, బిల్లుల జారీపై బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

4,712 మందికి రుణమాఫీ


రుద్రమూర్తి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ తాండూరు డివిజన్‌లో మూడో విడతలో 4,712 మంది రైతులకు వర్తించిందని తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2లక్షల వరకు మూడో విడతలో బషీరాబాద్-558 మందికి, కోట్‌పల్లి-703, పెద్దేముల్-767, తాండూరు-1871, యాలాల-813 మందికి మాఫీ అయిందని తెలిపారు. రుణమాఫీ కాని వారు 842 మంది రైతులున్నారన్నారు. దీనిపై ఏఈవోలు పనిచేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ కాలేదని ఎవరూ కార్యాలయానికి రావొద్దని, గ్రామాలకే ఏవో, ఏఈఓలు వచ్చి కుటుంబాల ఫొటోలు తీసుకుంటారని ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏవో కొమరయ్య, ఏఈఓలు ఉన్నారు.

మత్స్యకారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న జంగయ్య

కందుకూరు, సెప్టెంబరు 20: ఈనెల 25న ఇబ్రహింపట్నం నియోజకవర్గం కేంద్రంలో తలపెట్టిన మత్యకారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులగాజుల జంగయ్య కోరారు. ఈమేరకు శుక్రవారం ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు కాకి రాములు ఆధ్వర్యంలో స్థానిక ముదిరాజ్ భవనంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ సొసైటీలకు రూ.10లక్షలు వందశాతం సబ్సిడీపై మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో చెరువులు, కట్టలు కబ్జాలు, కాలుష్యానికి గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన రాష్ట్ర సదస్సుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యశాఖ సంఘం నేతలు పెద్దఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గూడూరు మాజీ ఎంపీటీసీ అనురాధ, ఆ సంఘం నేతలు కాకి మధుసూదన్, పిట్టల పాండు, కొర్వి సురేందర్, గొర్రెంక యాదయ్య, తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడాలి


రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయికుమార్‌చారి

కందుకూరు, సెప్టెంబరు 20: విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడాలని, అన్నిరంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం జిల్లా నాయకులు తల్లోజు సాయికుమార్‌చారి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శుక్రవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సన్మానించి విశ్వబ్రాహ్మణుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సాయికుమార్‌చారి తెలిపారు. నేడు తమ వృత్తి ద్వారా ఎలాంటి లాభం పొందడం లేదని, ప్రభుత్వ పరంగా సబ్సిడీలు అందించాలని, అన్ని రంగాల్లో చేయుతనందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

కందవాడలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి



చేవెళ్ల, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని కందవాడ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కావ్యకృష్ణగౌడ్, సీనియర్ న్యాయవాది, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ శుక్రవారం చేవెళ్లలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్‌ను కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందవాడతో పాటు గుండాల, లక్ష్మీగూడ, సాయిరెడ్డిగూడ, నారాయణదాస్‌గూడ, మల్లారెడ్డిగూడ, పలుగుట్ట, ఎర్రోనికొటాల గ్రామాల్లో సుమారు 20 వేల జనాభా ఉంటుందని చెప్పారు. మండలంలోని ఆలూర్‌లో కేవలం ఒకటే ఆరోగ్య కేంద్రం ఉండడంతో గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాగా, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఉప వైద్యాధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్‌సింగ్, నరేష్‌కుమార్, పద్మ, శివలీల, తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై కఠినంగా వ్యవహరించాలి


సైకిల్ పెట్రోలింగ్ సిబ్బందితో ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 20: ట్రాఫిక్ విషయంలో పోలీసులు మరింత అప్రమత్తతో ఉంటూ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద విజిబుల్ పోలీసింగ్, సైకిల్ పెట్రోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. సైకిల్ పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లు రమాదేవి, అశ్విని, మౌనికలను ఆయన అభినందించారు. విజిబుల్ పోలీసింగ్ చేస్తూ యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం

● మండల వైద్యాధికారి ప్రవీన్‌కుమార్



ఇంటర్వ్యూ...

పరిగి, సెప్టెంబరు 20: ప్రస్తుత సీజన్‌లో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు సోకే అవకాశం ఉండదని పరిగి మండల వైద్యాధికారి ప్రవీన్‌కుమార్ తెలిపారు.

ప్రశ్న: రోగాలు రాకుండా ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి?

జవాబు: ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలి. మంచి ఆహారం తీసుకోవాలి.

ప్రశ్న: వర్షాకాలంలో ప్రధానంగా సోకే వ్యాధులేమిటి?

జవాబు: వర్షాకాలంలో రెండు రకాల వ్యాధులు సోకుతాయి. కలుషిత నీరు తాగితే టైఫాయిడ్, పచ్చకామెర్లు, నీళ్ల విరోచనాలు వస్తాయి. కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల రక్త విరోచనాలు, నూలి పురుగు గుడ్లు, రక్తహీనత వస్తుంది.

ప్రశ్న: దోమలతో వ్యాధులు..? వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి..?

జవాబు: ఎక్కడైతే నీటి నిల్వ ఉంటుందో అక్కడ దోమలు వృద్ధి చెందుతాయి. దోమల కాటుతో మలేరియా, డెంగ్యూ బోధకాలు, మెదడువాపు, చికెన్ గున్యా వంటి వ్యాధులు సోకుతాయి. వీటి లక్షణాలు కలిగిన వారు నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రులను సంప్రదించి వైద్య సేవలు పొందాలి. ప్రభుత్వాస్పత్రుల్లో అన్నింటికీ వైద్యం చేస్తారు.

ప్రశ్న: ప్రజలకు మీరిచ్చే సలహాలు ఏమిటి..?

జవాబు: ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలి. ఇంటి ఆవరణంలో వర్షం, మురుగు నీరు ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. వ్యాధులు సోకితే వెంటనే ఆసుపత్రిలో సంప్రదించాలి.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

బంట్వారం, సెప్టెంబర్ 20: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులను శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్‌కు తీసుకెళ్లామని ప్రిన్స్‌పాల్ బ్యూలా అన్నారు. ఆమె మాట్లాడుతూ... కళాశాలలోని వొకేషనల్ విద్యార్థులను జూ అప్పరల్ లెవల్1లో భాగంగా, నాంపల్లిలోని వీవర్స్ సెంటర్‌కు తీసుకువెళ్లినట్లు తెలిపారు. విద్యార్థులకు అప్పరల్ విద్యార్థులకు, లెవల్ 4 విద్యార్థులకు ఇలాంటి విజిట్లు భవిష్యత్తులో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఆసక్తికరంగా విషయాలను నేర్చుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వొకేషనల్ ట్రైనర్ జ్యోతి, రామక్రిష్ణ తదితరులు ఉన్నారు.



వీవర్స్ సెంటర్‌లో విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్యూలా

ప్రసాదాల కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

కీసర రూరల్, సెప్టెంబరు 20: తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రసాదాల్లో కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామికి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంపిణీ చేసే లడ్డూ ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో కల్తీచేయటం క్షమించరాని నేరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీశారన్నారు. టికెట్ల ధరలను వేలకు వేలు పెంచటమే కాకుండా ప్రసాదాల కల్తీతో అక్రమ సంపాదనకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇక ముందు ఇలాంటి దోపిడీ చర్యలు జరగకుండా పటిష్టచర్యలు తీసుకోవాలి డిమాండ్ చేసారు.

మున్సిపాలిటీలో వసతుల కల్పన: ఛైర్‌పర్సన్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 20: మున్సిపాలిటీ పరిధి కాలనీల్లో మౌలిక వసుతల కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ 3వ వార్డులోని ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీ రూ.10లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచినట్లు గుర్తు చేశారు. అన్ని వార్డుల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతోపాటు డ్రైనేజీలను ఏర్పాటు చేశామని వివరించారు. ఒక్క ఎన్ఎఫ్‌సీ కాలనీకే కోట్ల రూపాయాల నిధులు డ్రైనేజీ పనులకోసం కేటాయించామన్నారు. మిగిలిన పనులూ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి 31.5లక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు20: మున్సిపాలిటీలో వివిధ పనులకుగాను రూ.31.5లక్షల వెచ్చించాలని పోచారం మునిపాలిటీ తీర్మానించింది. శుక్రవారం ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ నెల 17 నుంచి వచ్చేనెల 2వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలకు 9.5లక్షలు, బతుకమ్మ పండుగకు 9.5లక్షలు, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద పనులకు 10లక్షలు, మున్సిపాలిటీలో విస్తరిస్తున్న కోతులు, కొండముచ్చులను పట్టించేందుకు రూ.3లక్షలు కేటాయించాలని తీర్మానించినట్లు అధికారులు తెలిపారు. వైస్‌ఛైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్



బంట్వారం,సెప్టెంబరు 20:నల్సత్తాపూర్‌నకు చెందిన జి.మహేశ్వరి రెండు కిడ్నీల సమస్యతో చికిత్స పొందుతోంది. ఆమె ఆర్థిక సహాయం కోసం చూస్తోంది. బంట్వారం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పరమేశ్వర్ శుక్రవారం హైదరాబాద్‌లోని బీరంగూడలో శ్రీవేద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహేశ్వరిని పరామర్శించి రూ.5వేల అందజేశారు. ఆమెకు జిల్లా ప్రజలు, తోచినసాయం అందించాలని కోరారు.

కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ ఉషారాణి తదితరులు

కొడంగల్, సెప్టెంబరు 20: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వికారాబాద్ ఆధ్వర్యంలో కొడంగల్‌లోని బాలుర పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. మూడు రోజులు జరిగే ఈ పోటీల్లో రెండో రోజు శుక్రవారం ఎంఈవో రాంరెడ్డి, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి క్రీడలను ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుడ్యానికి దోహదపడాతయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్ పర్సన్ ఉషారాణి, నాయకుడు ప్రశాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని ఇంచార్జి ఎంఈవో రామారావు అన్నారు. ఘట్‌కేసర్‌లోని డిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 68వ పాఠశాల క్రీడల సమాఖ్య ఘట్‌కేసర్, మేడిపల్లి జోనల్ క్రీడలు ప్రాంభమయ్యాయి. ముఖ్య అతిధి ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలు, విద్యలోనూ ముందుండేందుకు శ్రమించాలన్నారు. ప్రతీ విద్యార్థి భగవద్గీతను చదవాలని సూచించా రు. అతిగా మాట్లాడే వారు జీవితంలో రాణించలేరన్నారు. ఈ క్రీడా పోటీల్లో 35పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. శనివారం ఫైనల్స్ నిర్వహించి జట్లను ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎస్ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నీతుగుప్తా, మేనేజ్‌మెంట్ డైరెక్టర్లు విజయ్‌పాల్‌రెడ్డి, రాధికారెడ్డి, ఘట్‌కేసర్ బాలుర హైస్కూల్ హెచ్ఎం పాపిరెడ్డి, జోనల్ క్రీడల కార్యదర్శి కె.శ్రీరాములు, ఆయా పాఠశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఈవోకు మొక్కను అందజేస్తున్న డీపీఎస్ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి మచ్చ

గ్యాస్ సబ్సిడీపై అందరికీ తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పెద్దేముల్, సెప్టెంబరు 20 : ప్రభుత్వం అందజేస్తున్న గ్యాస్ సబ్సిడీ పథకంపై అందరికీ తెలియజేయాలని పెద్దేముల్ ఎంపీడీవో జర్నప్ప అన్నారు. మండల పరిషత్‌లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, ఐకేపీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి శనివారం జరిగే గుర్తింపు పత్రాల పంపిణీ కార్యక్రమం విషయమై వారికి తగిన సూచనలు అందజేశారు. గ్యాస్‌సబ్సిడీ అందుతున్న వారికి గుర్తింపు పత్రాలను అ ందజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్దేముల్ మండలంలో మొత్తం 6011 మందికి సబ్సిడీ అందనుందన్నారు. కొందరి పత్రాలను ఎమ్మెల్యే అందజేస్తారని చెప్పారు. మిగతావాటిని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తీసుకుపోయి రేషన్‌డీలర్లతో ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రతన్‌సింగ్, ఏపీఎం బాలయ్య పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: దుద్యాలలో పంచాయతీ కార్యదర్శి కిషన్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్ లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందించారు. రవినాయక్ మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని అప్పాయిపల్లిలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం లబ్ధిదారులకు గుర్తింపు పత్రాలు అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: గ్యాస్ సబ్సిడీ పత్రాలతో లబ్ధిదారులు



కొడంగల్: అప్పాయిపల్లిలో గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి

అక్రమంగా నిర్మించిన గోడ కూల్చివేత



మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 20 : డబిల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 112 పార్ట్, 113 పార్టుల్లో ఓ అక్రమ వెంచర్‌లో చేపడుతున్న ని ర్మాణాలను పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి శుక్రవారం కూల్చివేయించారు. గ్రామ పానాదికి ఆనుకొని ఉన్న స్థలంలో అనుమతులు లేకుండా 29ప్లాట్లతో లేఅవుట్‌చేసి రియల్టర్లు అమ్ముకున్నారు. ఈ అక్రమ వ్యవహారాన్ని గమనించిన అధికారులు రియల్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా వారు అనుమతులు పొందకుండా గ్రామ పానాది (ఎడ్ల బండ్ల దారికి) అనుకుని ప్రహరీ నిర్మించేందుకు యత్నిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి తన సిబ్బందితో వచ్చి గోడను కూల్చారు.

బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై చర్చ

శామీర్‌పేట, సెప్టెంబరు 20: మున్సిపాలిటీలో బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్ల, తదితర అంశాలపై ఛైర్మన్, కౌన్సిలర్లు చర్చించారు. శుక్రవారం తూంకుంట కార్యాలయంలో ఛైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్ సమావేశాన్ని నిర్వహించారు. శామీర్‌పేట, బొమ్మరాసిపేట, బాబాగూడ గ్రామ పంచాయతీలు తూంకుంట మున్సిపల్‌లో నూతనంగా విలీనమైనందున ఆ గ్రామాల్లో పరిపాలనకు సంబంధించి కౌన్సిలర్లు చర్చించి తీర్మాణాలను చేశారు. అలాగే తదితర అంశాలపై సమావేశంలో కౌన్సిలర్లు చర్చించారు.

దేశ ప్రేమికులు బీజేపీలోకి రావాలి : ఎంపీ



కేరెల్లిలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు, సెప్టెంబరు 20: భారతదేశాన్ని ప్రేమించే వారంతా బీజేపీలో చేరాలని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా కేరెల్లిలో శుక్రవారం ఆయన సభ్యత్వాలు అందజేసిన మాట్లాడారు. జాతీయ వాదమే బీజేపీ సిద్ధాంతమని, దేశ హితం కోసమే ప్రధాని మోదీ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో భారతదేశాన్ని నంబర్‌వన్ స్థానంలో తీసుకువచ్చేందుకు ప్రధాని కృషి చేస్తున్నారన్నారు. దేశానికి రాహుల్‌గాంధీలాంటి వారు శత్రవులుగా తయారయ్యారని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు భూములన్నీ పేదలకు చెందాలని, కానీ అవి బడానేతల ఆధీనంలో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, నాయకులు పాండుగౌడ్, వడ్ల నందు, విజయభాస్కర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, క్రిష్ణ, రాజునాయక్, నరేందర్‌రెడ్డి, రవిగౌడ్, గోవర్థన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే స్వచ్ఛత సాధ్యం

పరిగి,సెప్టెంబరు 20: గ్రామీణుల్లో అవగాహనతోనే స్వచ్ఛత సాధ్యమని పరిగి ఎంపీడీవో ఏంఎ కరీం అన్నారు. డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిగురాల్‌పల్లి, రూఫ్‌ఖాన్‌పేట్,సోండేపూర్ గ్రామాల్లో ఇంటింటికి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుర్తించిన ఇళ్లలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్‌రాథోడ్, పంచాయతీ కార్యదర్శులు వెంకటగిరి, మొగులయ్య, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఎల్లప్ప, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు

ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా బోధించాలి

దౌల్తాబాద్, సెప్టెంబరు 20: విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ట్రైనీ కలెక్టర్, దౌల్తాబాద్ తహసీల్దార్ ఉమాహారతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంగ్లీష్ ఇన్ రీచ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. సులభ రీతిలో విద్యార్థులకు బోధించాలన్నారు. సహజసిద్ధంగా ఆంగ్ల పదాలు మాట్లాడేలా సంసిద్ధులను చేయాలని తెలిపారు. సమావేశంలో వివిధ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్, దౌల్తాబాద్ తహసీల్దార్ ఉమాహారతి

పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలి

మర్పల్లి సెప్టెంబరు 20 : పోషకాహారంపై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉంటే అనారోగ్యానికి గురికారని ఐసీడీఎస్ సీడీపీవో ప్రవీణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహరం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

రూ.59లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర రూరల్, సెప్టెంబర్ 20 : నాగారం మున్సిపాలిటీ 7వ వార్డులో రూ.39లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శుక్రవారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేకు కౌన్సిలర్ గూడూరు సబితఅంజనేయులుగౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనతరం వార్డులో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నాగారం మున్సిపాలిటీ రేణుక ఎల్లమ్మ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రతీ కుక్కకు రేబిస్ వ్యాధి నిరోధక టీకా

కీసర రూరల్, సెప్టెంబర్ 20 : మున్సిపల్ పరిధిలోని ప్రతీ కుక్కకు రేబిస్ వ్యాధి నిరోధక టీకా(ఏఆర్వీ) వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత తెలిపారు. శుక్రవారం కార్యాలయం ఆవరణలో ఈ నెల 29 వరకు కొనసాగించనున్న రేబిస్ టీకా డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కుక్కకాటుతో వ్యాపించే రేబిస్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రాబిస్ టీకా డ్రైవ్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. 409 కుక్కలకు టీకా వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, బ్లూ క్రాస్ ప్రతినిధి కుమారి, వరల్డ్ వెటర్నరీ సర్వీసెస్ బృందం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తన సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడని కత్తితో వ్యక్తిపై దాడి



నిందితుడు మహేష్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 20: బావపై బావమరిది కత్తితో దాడిచేసిన ఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ డైమాండ్ యూత్ వినాయక శోభాయాత్రలో డీజే ఆపరేట్ సాయి అలియాస్ మోక్షయాదవ్‌ను అతడి బావమరిది మహేష్ వెనుక నుంచి కత్తితో పొడిచాడన్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకోని సాయిని కీసరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మహేష్ సోదరి మానస ఇటీవల కుటుంబ సభ్యులకు ఇష్టంలేని సాయితో ప్రేమ వివాహం చేసుకుందని, అందుకే దాడి చేసినట్లు విచారణలో తేలిందని తెలిపారు. మానస ఫిర్యాదు మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసిరిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దోమ, సెప్టెంబరు 20: ఓ మహిళ మనస్థాపానికి గురై క్రిమిసంహారక మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బొంపల్లికి చెందిన కమలమ్మ(47) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడేది. ఈ నెల 19న క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను మొదట పరిగి ప్రభుత్వాసుపత్రికి, నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కమలమ్మ శుక్రవారం మృతిచెందింది. ఆమె కుమారుడు మధు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు.

22 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 20 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోను ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని 22క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. పోలీసులు తెలిపన వివరాల ప్రకారం.. రాజబొల్లారం తండాకు చెందిన యాదగిరి శుక్రవారం ఆటోలో 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. ఎస్ఓటీ పోలీసులు రాజబొల్లారం చౌరస్తా వద్ద ఆటోను పట్టుకున్నారు. 22 క్వింటాళ్ల రేషన్ బ్యియ్యం, ఆటోను, సీజ్ చేసి కేసునమోదు చేశారు.

పెద్దేముల్ మండలంలో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యం...

పెద్దేముల్: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పౌరసరఫరాల డీటీ, టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు కలిసి దారికాచి వాహనాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని సోదాచేయగా 14క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. డ్రైవర్ కళ్లెం వెంకట్, బియ్యాన్ని తరలిస్తున్న బోయిని సుభాష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

కిరాణా దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

కులకచర్ల, సెప్టెంబరు 20: చౌడాపూర్‌లోని కిరాణా దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. కల్తీ అల్లంపేస్టు, టీ పౌడర్, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కిరాణా దుకాణాల్లో దాడులు చేశారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నామని, దాడులు కొనసాగుతాయని ఎస్సై తెలిపారు.

మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరణ

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 20: నాందర్‌పూర్‌లో శుక్రవారం పట్టపగలు దొంగలు హల్‌చల్ చేశారు. వృద్ధురాలు చిట్లపల్లి లక్ష్మమ్మ రోడ్డు పక్కన దుకాణం నుంచి ఇంటికి వెళ్తుండగా పంచాయతీ సమీపంలో దుండగులు కత్తితో బెదిరించి మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకెళ్లారు. దుండగులు పారిపోతుండగా ఖాళీబ్యాగు పడిపోయింది. ఎస్సై అబ్దుల్ రవూఫ్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని దర్యాప్తు చేశారు. దుండగుల భాషను బట్టి వారు అంతరాష్ట్ర దొంగలుగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. గతంలోనూ ఇలాంటి దొంగతనాలు జరిగినా పోలీసులు ఛేదించలేదు.

బస్సులో ప్రయాణికురాలి ఆభరణాల చోరీ

ధారూరు, సెప్టెంబరు 20: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ బ్యాగులోని బంగారం, వెండి నగలు చోరీ అయిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. యాదగిరిగుట్ట నుంచి తాండూర్ వస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సును డ్రైవర్ ధారూరు పోలీసుస్టేషన్ వద్ద నిలిపి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రయాణికులందరినీ తనిఖీ చేసినా వస్తువులు దొరకలేదు. యాదగిరిగుట్ట నుంచి తాండూర్‌కు వస్తున్న బస్సులో 100 మంది ఉన్నారు. వికారాబాద్‌లో ఓ మహిళ బస్సులో ఎక్కి కండక్టర్‌కు ఆధార్‌కార్డు చూపుతున్న సమయంలో తన బ్యాగులోని 2తులాల బంగారం గొలుసు, ఉంగరాలు, వెండి వస్తువులు లేవని గుర్తించింది. దీంతో డ్రైవర్ బస్సు నిలిపి విషయం పోలీసులకు చెప్పా రు. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ ఇద్దరు పోలీసులతో ప్రయాణికులను గంటపాటు తనిఖీ చేసినా వస్తువులు లభించలేదు. దీంతో బస్సును పంపించేశారు.

చికిత్స అందక గేదె మృత్యువాత



ఆసుపత్రి వద్ద మృతిచెందిన గేదె

వికారాబాద్, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రంలో పశువైద్యాధికారి నిర్లక్ష్యంతో వైద్యమందక ఓ గేదె మృత్యువాత పడింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొత్తగడికి చెందిన రైతు రవికి చెందిన గేదె అస్వస్థతకు గురికాగా ఉదయం 9గంటలకు వికారాబాద్ పశువైద్యశాలకు తీసుకొచ్చాడు. గంటలు గడుస్తున్నా వైద్యులు రాకపోవడంతో డాక్టర్ పూర్ణచందర్‌రావుకు ఫోన్‌చేశాడు. 'నేను ఏం చేయాలి? స్పీకర్ కార్యక్రమంలో మోమిన్‌పేటలో ఉన్నా. ఇప్పుడు 50 కిలోమీటర్లు పరుగెత్తుకుంటూ రావాలా? గేదె చస్తే చావని.' అని వైద్యుడన్నారని రవి తెలిపాడు. పక్కనే జిల్లా పశువైద్యాధికారి కార్యాలయంలో ఉండే డాక్టర్ సదానందం సైతం పట్టించుకోలేదు. సాయంత్రం వరకూ చికిత్స అందక గేదె తీవ్ర అస్వస్థకు గురైంది. ఇది తెలిసి కొందరు మీడియా ప్రతినిధులు డాక్టర్ సదానందాన్ని ప్రశ్నించగా ఈ విషయం నాకు ఇప్పుడే తెలిసిందంటూ చికిత్స చేశారు. అంతలోనే గేదె చనిపోయింది. వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్లే గేదె మృతిచెందిందని దాని విలువ రూ.1.2లక్షలు ఉంటుందని రవి కన్నీరుమున్నీరయ్యాడు. మొన్నటి వరకు వికారాబాద్ ఇన్‌చార్జిగా పశువైద్యాధికారిగా పూర్ణచందర్‌రావు పనిచేశారు. సదానందం కొత్తగా జిల్లా అధికారిగా వచ్చారు. ఇద్దరు వికారాబాద్‌లోనే పనిచేయడంతో వారి మధ్య గ్రూపులేర్పడ్డాయి. పూర్ణచందర్‌రావు ఇన్‌చార్జిగా చేసిన సమయంలో కఠినంగా వ్యవహరించడంతో సిబ్బంది ప్రస్తుత జిల్లా అధికారి సదానందం పంచన చేరారు. పూర్ణచందర్‌రావు స్పీకర్ పర్యటకు పోవడం.. ఈ క్రమంలో చూద్దాం.. ఏం అవుతుందో అనే ధోరణితో సిబ్బంది, అధికారి పట్టించుకోకే మూగజీవి మృత్యువాత పడింది.

రేషన్ డీలర్ల మండల కార్యవర్గం ఎన్నిక



తహసీల్దార్ ఆనంద్‌రావుతో రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం

పరిగి, సెప్టెంబరు 20 : రేషన్ డీలర్ల సంఘం పరిగి మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా కె.మహిపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పసియొద్దీన్, ఉపాధ్యక్షుడు బి.నర్సింహులు, కోశాధికారిగా తులసీరామ్, కార్యవర్గసభ్యులు ఎ.లక్ష్మి, ఎస్.నిర్మల, మురళీధర్‌రెడ్డి, సత్తయ్య, మంజులత, ప్రవీణ, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని రేషన్‌డీలర్లు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా భాగ్యలక్ష్మి



పరిగి, సెప్టెంబరు 20: పరిగి మండలం జాఫర్‌పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా కె.భాగ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటి వరకు యాదయ్య ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి బదిలీపై జాఫర్‌పల్లికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

సంక్షిప్తంగా...

● **ఘట్‌కేసర్:** మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఘట్‌కేసర్‌లో శుక్రవారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. జామా మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నర్వహించారు. మధ్యాహ్నం నమాజ్ ముగిసిన అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ కొనసాగింది, ఊరేగింపులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు భారీగా పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **ధారూరు:** మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల్లో భాగంగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. జామ మసీదు నుంచి లతీఫ్ ఉస్సిసా మసీదు వరకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి ఎంఐఎం మండలాధ్యక్షుడు మొయిజ్ ఖురేషి ఆధ్వర్యంలో వాహనాలలో హైదబాద్‌లోని దారూ సలాంకు బయలుదేరి వెళ్లారు.

● **పరిగి:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలనూ శుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇంటికి వచ్చే బండిలో వేయాలని సూచించారు. హెచ్ఎం కృష్ణారెడ్డి, టీఎంసీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: సమాజంలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్‌ను పాటించాలి, పరిసరాలను పరిశుభ్రం చేయాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక, టీచర్లు విద్యార్థులకు పిలుపునిచ్చారు. తూంకుంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తూంకుంటలోని జడ్పీ పాఠశాల్లో స్వచ్ఛభారత్, సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రేణుక విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల, ఉపాధ్యాయులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆమె విద్యార్థులకు హితవు చెప్పారు.

● **మేడ్చల్ టౌన్:** మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో రూ.11.5లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని మేడ్చల్ ఛైర్‌పర్సన్ దీపిక అన్నారు. రెండో వార్డులో సీసీ రోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ రొయ్యపల్లి సరితతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... వార్డులోని అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. వర్షాలతో రోడ్ల రోడ్డులు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేయిస్తామన్నారు. అవసరమున్న వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, నాయకుము మల్లేష్‌గౌడ్, మర్రి నర్సింహారెడ్డి, కొండల్ రెడ్డి, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక సారించాలని బషీరాబాద్ ఎంపీవో బాలరంగాచారి అన్నారు. నవాల్గ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యదర్శి వెంకటేష్‌తో పలు అంశాలపై చర్చిస్తూ రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో వార్డులవారీగా ఓటర్ల విభజన ప్రక్రియ ఎలా జరిగిందానే దానిపై స్వయంగా పరిశీలించారు. ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే 21వ తేదీ లోపు స్వీకరించాలని కార్యదర్శికి సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు శుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు.

● **కులకచర్ల:** అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కులకచర్లలో ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న డబుల్ సీసీ రోడ్డు పనులను డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్ పరిశీలించారు. గత ప్రభుత్వం పనులకు రూ.2.8లక్షలు మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులు చేయలేదన్నారు. నాయకులు ఆనంద్, వెంకటయ్యగౌడ్, వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కృష్ణ, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** ట్రైనీ ఎస్ఐ రథోడ్ మంజూలకు సొంత మండలం బషీరాబాద్‌లో ఘనస్వాగతం లభించింది. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేష్, స్థానిక నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. గిరిజన కుటంబంలో పుట్టి అనుకున్న లక్ష్యంతో ఎస్ఐగా ఎంపికై, శిక్షణపూర్తి చేసుకోవడం స్ఫూర్తిదాయకమని ఎస్.వెంకటేష్ కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసీ సభ్యులు మునీర్, కాంగ్రెస్ నాయకులు సాయిల్‌గౌడ్, జగన్నాథ్‌రావు, ఖాలీద్, వార్డు మెంబర్ రాము తదితరులున్నారు.

● **నవాబుపేట:** లింగంపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. పార్టీ జిల్లా కార్యదర్శి సారా జగన్, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

● **కొడంగల్:** బొంరాస్‌పేట్‌లోని ఎస్బీఐ వద్ద మూడు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపట్టిన రైతులు షరతులు రుణమాఫీకి డిమాండ్ చేశారు. బ్యాంకులో సరిపడినంత సిబ్బందిని నియమించాలన్నారు. కొడంగల్‌లోని కడ కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని కలిసి వారు వినతి పత్రం అందించారు.